కథానిక

# సంకల్ప సిద్ధి

ఎస్. యం. సుబాని

అటు భర్త, ఇటు కొడుకు—ఎవరికీ నచ్చచెప్పలేక సతమతమయింది లక్ష్మమ్మ. అంతవరకు తండ్రి మాట జవదాటని కొడుకు రాఘవరావలా ప్రవర్తించటం ఆమెకు ఆశ్చర్యంగా కన్పించినా అనుచితంగా తోచలేదు. అంతమాత్రానికే తన భర్త విసిగిపోయి కొడుకు విషయంలో అంతటి కాఠిన్యాన్ని చూపుతాడనుకోలేదు. ఆఖరుకు గత్యంతరం లేక తండ్రి నిర్ణయాన్ననుసరించి రాఘవరావు యిల్లు వదలిపెట్టి పోతుంటే దుఃఖంతో ఆమెకు హృదయం తరుక్కుపోతున్నట్లనిపించింది. ఏమీ చేయలేక పరితపిస్తున్న తల్లి బాధను అర్థంచేసుకుని ఆమెను ఇంకా బాధపెట్టకూడదనుకున్నాడు రాఘవరావు. కేవలం ఒక చూపుతో తల్లిదగ్గర అనుజ్ఞ తీసుకుని బయలుదేరాడు.

ఊళ్ళోనే ఉన్న తన స్నేహితుడు ప్రకాశం యింటికివెళ్ళి అతని చెల్లెలితో సంగతులన్నీ చెప్పి తల్లికి ధైర్యం చెప్పమని పంపించాడు. ఆ తరువాత చేయవలసిన కార్యక్రమాన్ని గురించి ప్రకాశంతో ఆలోచించాడు ప్రకాశం చెప్పిన సలహాలు అతనికేమీ నచ్చలేదు ప్రకాశం రాఘవరావును కొన్నాళ్ళు తన యింట్లో ఉండమన్నాడు. అతని తీరుచూస్తే రాఘవరావుకు ఏదో పెద్ద విపత్తు కలిగినట్లు, తాను వీలైనంత సహాయం చేయాలనుకుంటున్నట్లు ఉన్నది ఆ ధోరణి రాఘవరావుకు నచ్చదు. చివరకు ఒక నిశ్చయానికొచ్చి ప్రాంతీయ సంఘ కార్యాలయం ఉన్న పట్నానికి బయలుదేరాడు రాఘవరావు.

బి ఏ. పరీక్షకు కూర్చున్న రాఘవరావు 'క్లాసు' వస్తుందనే అంచనాలో ఉన్నాడు క్లాసు రాకపోయినా కనీసం మంచి మార్కులతో ప్యాసవగలడనే ధైర్యం ఉన్నది. రాఘవరావు పెళ్ళినిగురించి అతనికి, అతని తండ్రికి మధ్య అభిప్రాయ భేదాలు ఏర్పడినై. అంతవరకు తండ్రి మాటను ఎదిరించని రాఘవరావు తన నిశ్చితాభిప్రాయాన్ని తెలియచేసి పరోక్షంగా తండ్రిమాటను నిరాకరించాడు.

రాఘవరావు చెప్పేదాని మాదిరిగానే అతని తండ్రి చెప్పేదానిలో కూడా అనుచిత మేమీ లేదనిపిస్తుంది. ఉన్నది నాలుగెకరాల భూమి మాత్రమే! ఇంట్లో పెళ్ళీడుకొచ్చిన పిల్ల ఉన్నది. రాఘవరావు చదువు బి ఏ తో ఆపితే ఎందుకూ పనికిరాకుండా పోతుందతని చదువు. కాబట్టి అతనిని ఎం. ఏ వరకో చ ది విం చా ల ని ఆయన ఉద్దేశం. ఆ విధంగా చదివించాలంటే డబ్బు కావాలి ..దానికిగాను కొడుక్కు పెళ్ళి చేసి వీలైనంత కట్నం రాబట్టాలని ఆయన కోరిక కట్నం లేకుండా పెళ్ళిచేయటం మంచిదేనని ఆయన కూడా ఒప్పుకుంటాడు, కాని పరిస్థితి ప్రసక్తి తెచ్చి అది పొసగదంటాడు.

"వాడి పెళ్ళిలో కట్నం తీసుకోకపోతే పొలమమ్మి వాడిని చదివించాలి. సరే చదిస్తాను ఆ తరువాత పిల్ల పెళ్ళి చేసే—లా? సాంప్రదాయం కలిగి కొద్దో గొప్పో స్థితిమంతులైనవారింట్లో పిల్ల నివ్వాలంటే కట్నం లేకుండా ఎలా సాగుతుంది? ఆశయాలు, ఆదర్శాలు, నాకూ ఉన్నై' కాని అవి సాగే దెలాగంటా...వీడు కట్నం లేకుండా చేసుకుంటున్నట్లు దేశంలో కుర్రవాళ్ళంతా కట్నం లేకుండా తెలివితక్కువగా పెళ్ళి చేసుకుంటారా?" అంటాడు ఆ అనటంలోనే "కట్నం లేకుండా పెళ్ళిచేసుకోవటం తెలివితక్కువ" అనే ధోరణి వ్యక్తం చేస్తాడు.

అది ఏమాత్రం రాఘవరావు ఒప్పుకోడు. తన చెల్లెల్ని కూడా తనమాదిరిగానే కట్నం తీసుకోకుండా చేసుకోనేవాడి కిచ్చి పెళ్ళిచేస్తానంటాడు. "కాదంటారా, ఎందుకైనా మంచిది చదువు మానేసి ఉద్యోగ ప్రయత్నం చేస్తాను. పొలం

చదువుకొరకు అమ్మనక్కర్లేదు. కట్నం ఇవ్వకుండా అమ్మాయి పెళ్ళి చెయ్యకలిగితే మంచిదే, లేకపోతే అప్పుడా పొలాన్ని అమ్మి దాని పెళ్ళి చేయవచ్చు" నంటాడు రాఘవరావు.

"బోడి బి. ఏ. కు ఉద్యోగమిచ్చే దెవడు? ఇచ్చినా గుమాస్తా ఉద్యోగమే కదా!" అనే అసంతృప్తి, దానితోబాటు నిరాకరణ తెలియ జేస్తాడు రాఘవరావు తండ్రి.

ఆఖరుకు "రెట్టమతం చెరిసగం" అనుకోవటంలో రాఘవరావు యిల్లు విడిచిపెట్టి బయలు దేరాల్సి వచ్చింది. అటువంటి పరిస్థితి ఏర్పడినందుకు రాఘవరావుకి ఎంతో చిరాకు కలిగింది. ఈ ఒక్క విషయంలో తన తండ్రి సానుభూతితో తన ఆశయసిద్ధికి సహకరించి ఉంటే బాగుండే దనుకున్నాడు. గత్యంతరం లేకపోవటంవలన తండ్రి తాత్కాలిక కోపంలో చేసిన నిర్ణయానుసారం కర్తవ్యనిష్ఠతో బయలుదేరాడు.

రాఘవరావు ప్రాంతీయ సంఘ కార్యదర్శిని కలుసుకుని అధ్యక్షులైన దక్షిణామూర్తిగారింటికి వెళ్ళాడు. దక్షిణామూర్తిగారు విషయమంతా తెలుసుకున్నారు. ఈ విషయాన్ని పరిష్కరించి కృతకృత్యులవటం సులభంకాకపోయినా, రాఘవరావులాంటి యువక సభ్యుని సహాయంతో సంఘం నిర్మాణాత్మకమైన కృషి సాగించే అవకాశం లభించినందుకు వారు చాలా సంతోషించారు. ఇందులోని ఔన్నత్యాన్ని భావించినవారి మనోభావాలు వారి ముఖంలో ప్రతిబింబించినై!

దక్షిణామూర్తిగారికి స్థానికంగా మంచి పలుకుబడి ఉన్నది. వారు రాఘవరావుకు బస సంఘ కార్యాలయంలోనే ఏర్పాటు చేశారు. రాఘవరావుకొరకు ఉద్యోగ ప్రయత్నం చేయాలన్నా రిజల్ట్సు వచ్చేంతవరకు ఆగాలి ... ఎంతలేదన్నా దాదాపు ఒకనెల పడ్తుంది. వారు ఆలోచించి, రాఘవరావుకు హిందీ బాగా వచ్చుకాబట్టి, కొన్ని ట్యూషన్లు ప్రయత్నించి ఏర్పాటు చేశారు. ప్రాథమిక, మధ్యమ, రాష్ట్రభాష—ఈమూడు తరగతులవారికి చెప్పేందుకు ఒప్పుకున్నాడు రాఘవరావు. ప్రాథమికవాళ్ళు ఐదుగురున్నారు చిన్నపిల్లలు, మధ్యమవాళ్ళు ముగ్గురు, రాష్ట్రభాష విద్యార్థి ఒకతను, ఉన్నారు. అక్కడి మాష్టరు తీసుకుంటున్న దానికంటే కొంచెం తక్కువ జీతానికే ఒప్పుకున్నాడు రాఘవరావు. అతని నెలసరి ఆదాయం ఇరవైమూడు రూపాయలు! ఒకసారి తనలో తాను నవ్వుకున్నాడురాఘవరావు. హుషారుగా పిల్లల్ని సెప్టెంబరు పరీక్షకు తయారు చేయాలి. ఇంకా దాదాపు ఐదు నెలల వ్యవధి వున్నది. ఉత్సాహంతో ఉపక్రమించాడు రాఘవరావు.

మొదటినెల అధ్యక్ష ఉపాధ్యక్షుల ఇళ్ళలోను, రోజుకొకరి యిల్లుచొప్పున నలుగురు సోదర సభ్యుల యిళ్ళలో నాలుగురోజులూ, విందు కుడిచాడు రాఘవరావు. అతను మనసులో సిగ్గుపడేందుకు ఎటువంటి అవకాశం లేకుండా ప్రవర్తించారు గృహస్థులు. ఆనెల రోజులూ శుభకార్యంలో మాదిరిగా పిండివంటల్తో ప్రత్యేక భోజనం అమర్చి అతను గర్వపడేలా చేశారు. చేతిలో మొదటినెల ఇరవైమూడు రూపాయలు రాగానే పూటకూటి యింట్లో నెలకు పంధొమ్మిది రూపాయలకు భోజనవసతి ఏర్పర్చుకున్నాడు రాఘవరావు. అతని బుద్ధి కుశలత చూస్తున్న దక్షిణామూర్తిగారు చాల సంతోషించారు. వారి ఉత్సాహం పొంగి పొర్లింది.

రిజల్ట్సు రావటంతో రాఘవరావుకు అతనను కున్నట్లే అతని కష్టానికి తగిన ఫలితం లభించినట్లు తెలిసింది. దీనివలన అతను పొందతగినంత ఉత్సాహము పొందకపోయినా పట్టుదల మాత్రం వీడ లేదు. వెంటనే నాలుగయిదు కంపెనీలకు ఉద్యోగం కొరకు దరఖాస్తులు పెట్టాడు. దక్షిణామూర్తిగారు వారిప్రయత్నం వారు ప్రారంభించారు. స్థానిక కళాశాల ప్రిన్సిపాలుతో సంప్రదించి తగిన సహాయం చేసేందుకు వాగ్దానం పుచ్చుకున్నారు...ఇచ్చిన మాట ప్రకారం వారు సహాయంకూడా చేశారు. తమ కళాశాలలో అవకాశం లేనందున తమ మిత్రు లొకరు ప్రిన్సిపాలుగా ఉన్న మద్రాసు కళాశాలలో ఇంగ్లీషు ట్యూటరుగా రాఘవరావును నియమింపజేశారు.

దక్షిణామూర్తిగారు రాఘవరావు వివాహ ప్రసక్తి తెచ్చారు. రాఘవరావు నవ్వుతూ తన స్నేహితుని చెల్లెలొకామె ఉన్నదని తెలియ

జేశాడు. సంబంధం ముందుగా వెతుకుతున్నందుకు వారు నవ్వుతూ చమత్కారంగా మాట్లాడారు.

పట్నంలోనే సంఘం పర్యవేక్షణక్రింద వివాహం చేసుకోవాలనుకున్న రాఘవరావు, అన్ని సంగతులు తెల్పుతూ ప్రకాశానికి ఉత్తరం వ్రాశాడు. చెల్లెల్ని వెంటపెట్టుకుని రమ్మన్నాడు. ఈ విషయాలన్నీ విన్న ప్రకాశం చెల్లెలు అనూరాధ ఆనందానికి అవధిలేకుండా పోయింది.


రాఘవరావు తండ్రికి కూడ ఒక ఉత్తరం వ్రాశాడు సంగతులు సందర్భాలన్నీ తెలియజేస్తూ. ఉత్తరం చదువుకుంటే రాఘవరావు తండ్రిమనసు చలించింది. లక్ష్మమ్మ లోలోనే దుఃఖిస్తున్నది. ఆమె దుఃఖాన్ని హృదయారాటాన్ని చూస్తుంటే ఆయనకు తెలిసింది, తానెంత తప్పుచేశాడో. ఆ 'శిక్ష' ఒక్క రాఘవరావుకేగాక అతనితల్లికి కూడ విధించినట్లనిపించింది. స్వయంగా, కొడుకును ఇంట్లోంచి వెళ్ళమని తనకుతాను శిక్షించుకున్నట్లు భావించాడు. దానితో, కొడుకు తనమాట వినలేదనే భావంవలన ఏర్పడిన మిథ్యాభిమానం దూరమై పోయింది. భార్యను వెంటబెట్టుకుని బయలుదేరాడు.

అప్పుడే రిజిస్ట్రారాఫీసునుండి అనూరాధ, తదితరులతో తిరిగివచ్చి దక్షిణామూర్తిగారింట్లో అడుగుపెట్టున్న రాఘవరావు ఎదురుగా కన్పించిన తల్లిదండ్రుల్ని చూసి నిర్ఘాంతపోయాడు. కళ్ళలో నీళ్ళు నిలవగా ఆప్యాయంతో తనవైపు చూస్తున్న తల్లిని చూడగానే అతని హృదయంలోని మాతృ ప్రేమ పెల్లుబికింది ... రాఘవరావు చేతులు జోడించి తల్లిదండ్రులకు నమస్కరించాడు. మామగారి గంభీరముద్రచూచిన అనూరాధ నమస్కారం చేస్తూ అతని పాదాలపై తల ఆనించి అలాగే నేలమీద వంగి కూర్చుని ఉండిపోయింది. చూచి 'పిచ్చిపిల్లా'అంటూనవ్వుతూ కోడల్ని లేవనెత్తాడు.

"చూడు, వాడికంటె పిల్లే బుద్ధిమంతురాలు" అన్నాడాయన కోడలిని భార్యకప్పగిస్తూ.

"వాళ్ళ అన్న దానిచేత వాడి శుశ్రూష చేయించబట్టే అదంత బుద్ధిమంతురాలైంది" అన్నది లక్ష్మమ్మ కోడలిగడ్డం పుణుకుతూ.

మధుర లజ్జాదృష్టుల్తో రాఘవరావు వైపు చూస్తున్న అనూరాధముఖంలో ఒక మందహాస రేఖ వింతగా భాసించి శోభించింది.



పాండిచేరి నేషనల్ ఎక్స్టెన్షన్ స్కీము ప్రారంభోత్సవ సందర్భంలో, స్థానిక మహిళాసంఘంవారిస్తూన్న నృత్య ప్రదర్శనాన్ని తిలకిస్తూన్న ప్రేక్షకులు.